క్లుప్తంగా

క్యాన్సర్ బాధితురాలికి సాయం



చెక్ అందిస్తున్న వసుధ ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ లక్ష్మీనరసింహరాజు

కోటవురట్ల: క్యాన్సర్‌తో బాధపడుతున్న ఓ మహిళకు వసుధ ఫౌండేషన్ ఆర్థిక సహాయం చేసింది. తంగేడు గ్రామానికి చెందిన శింగంపల్లి రమణమ్మ కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్స పొందుతోంది. పేద కుటుంబం కావడంతో వసుధ ఫౌండేషన్ అనకాపల్లి జిల్లా కన్వీనర్ ఆర్ఎస్ లక్ష్మీ నరసింహరాజు ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు దృష్టికి తీసుకెళ్లారు. దాంతో ఆమె చికిత్స కోసం ఫౌండేషన్ నుంచి రూ.15 వేలు సాయం అందిస్తూ చెక్ అందజేశారు. ఫౌండేషన్ సభ్యులకు రమణమ్మ కృతజ్ఞతలు తెలియజేశారు.

వైఎస్సార్‌సీపీ ఎస్.రాయవరం మండల సమావేశం నేడు



కంబాల జోగులు

ఎస్.రాయవరం: వైఎస్సార్‌సీపీ ఎస్.రాయవరం మండలం విస్తృత స్థాయి సమావేశం ఆదివారం అడ్డురోడ్డు శ్రీనివాస కల్యాణ మండపంలో ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్టు మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, అనకాపల్లి పార్లమెంట్ కన్వీనర్ బొడ్డేడ ప్రసాద్, నియోజకవర్గ నాయకులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. ఎస్.రాయవరం మండలం, గ్రామ కమిటీల ఏర్పాటు ఈ సమావేశం ఉంటుందన్నారు. కార్యకర్తలు, నాయకులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఘనంగా ఘటాల ఊరేగింపు



తిమ్మరాజుపేటలో ఘటాలను ఊరేగిస్తున్న భక్తులు

అచ్యుతాపురం: మండలంలోని తిమ్మరాజుపేటలో దేవీ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఘటాల ఊరేగింపు ఘనంగా జరిగింది. అమ్మవారిని పలు రూపాల్లో అలంకరించారు. దీపాలంకరణ, జ్యోతి వెలగింపు కార్యక్రమాలతో ఆధ్యాత్మిక శోభ నెలకొంది.

మునగపాకలో జీఎస్టీ కరపత్రాల పంపిణీ



జీఎస్టీ కరపత్రాలు పంపిణీ చేస్తున్న మండల ప్రత్యేకాధికారి రహీమ్

మునగపాక: కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చిన నూతన జీఎస్టీని సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి రహీమ్ కోరారు. శనివారం మునగపాకలో జీఎస్టీ కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన జీఎస్టీ విధానం వల్ల పలు రకాల పరికరాలు తక్కువ ధరకే లభిస్తాయన్నారు. తహసీల్దార్ పి.సత్యనారాయణ, ఎంఈవో వేణుగోపాలరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మానస, మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి, ఈవోఆర్డీ సోమరాజు, వెలుగు ఏపీఎం బాలరాజు, ఏపీవో శివ, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తగ్గిన జీఎస్టీపై అవగాహన అవసరం



దుకాణాల్లో జీఎస్టీపై వినియోగదారులతో మాట్లాడుతున్న అధికారులు

ఎస్.రాయవరం: తగ్గిన జీఎస్టీపై అవగాహన అవసరమని డీఆర్‌డీఏ పీడీ శచీదేవి అన్నారు. అడ్డురోడ్డులో శనివారం పలు దుకాణాలకు ఆమె వెళ్లి తగ్గిన జీఎస్టీ స్లాబ్ రేట్లపై అవగాహన కల్పించారు. తగ్గిన జీఎస్టీ స్లాబ్ ప్రకారమే వస్తువులను అమ్మాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మనోరమ, తహసీల్దార్ రమేష్‌బాబు, ఎంపీడీవో మీనాకుమారి, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ, ఏపీవో శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరికి తెగులు.. రైతుల దిగులు

- అంతంత మాత్రంగా దిగుబడి
- నష్టాల్లో కొబ్బరి రైతులు



దిగుబడి తగ్గి కొబ్బరికాయలు

పాయకరావుపేట: తెగులు బెడదతో కొబ్బరి రైతులు ఆందోళన చెందుతున్నారు. దిగుబడి తగ్గడంతో నష్టాలు చవిచూస్తున్నారు. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, యలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం, కోటవురట్ల తదితర మండలాల్లో రైతులు కొబ్బరి తోటలు ఎక్కువగా సాగు చేస్తున్నారు. గతంలో ఎకరం కొబ్బరితోటకు రైతుకు ప్రతి రెండు నెలలకు 1000 కాయలు దిగుబడి వచ్చేది. కానీ ఇప్పుడు దిగుబడి గణనీయంగా తగ్గిపోయిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాయకరావుపేట సబ్ డివిజన్ పరిధిలోని పాయకరావుపేట, నక్కపల్లి, కోటవురట్ల మండలాల్లో 2941 హెక్టార్లలో 850 మంది రైతులు కొబ్బరిని సాగు చేస్తున్నారు. అదే విధంగా యలమంచిలి సెక్షన్ పరిధిలోని యలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం, ఎస్.రాయవరం మండలాల్లో 3524 హెక్టార్లలో 1800 మంది రైతులు కొబ్బరి తోటలు సాగు చేస్తున్నారు.

ప్రస్తుతం తెల్ల దోమ తెగులు కారణంగా పంట దిగుబడి గణనీయంగా తగ్గిందని పలువురు రైతులు చెబుతున్నారు. పెట్టుబడులు పెరిగిపోవడం.. దిగుబడి తగ్గిపోవడంతో రైతులు తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారు. దిగుబడి తక్కువగా ఉన్న కారణంగా ఇటీవల కొబ్బరి కాయ ధర రూ.20 వరకు పలికింది. తోటలో రైతుల దగ్గర నుంచి వ్యాపారులు కొనుగోలు చేయడంతో కొంత వరకు ఊరట చెందారు. ఆశించిన స్థాయిలో ఆదాయం సమకూరకపోవడంతో కుటుంబ పోషణ కష్టమవుతోందని రైతులు వాపోతున్నారు. స్థానికంగా ఉన్న రసాయన పరిశ్రమల వల్ల కొబ్బరి తోటలకు దిగుబడి తగ్గిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



కొబ్బరి బొండాలను ఒలుస్తున్న కూలీలు



తెల్ల దోమ సోకిన కొబ్బరి ఆకులు

వేపనూనె పిచికారీ చేయాలి

చలికాలంలో తెల్ల దోమలు తేనేలాంటి జిగటు పదార్థం విడుదల చేయడం వల్ల కొబ్బరి ఆకులు నల్లగా మారిపోయాయి. దీంతో కాపు తగ్గిపోతుంది. తెల్లదోమ నివారణకు రైతులంతా సామూహికంగా వేపనూనెను పిచికారీ చేయాలి. యూరియా, సూపర్ పొటాష్ కలిపి సంవత్సరానికి రెండుసార్లు వేయాలి. పచ్చిరొట్ట ఎరువులు కూడా ఉపయోగించాలి. వేసవికాలంలో ఈ తెగుళ్ల తగ్గుముఖం పెడతాయి.
– సాయి ప్రియ, ఉద్యానవన శాఖాధికారి

రసాయన పరిశ్రమలతో నష్టం



కొబ్బరి దిగుబడి తగ్గిపోయింది. సమీపాన ఉన్న రసాయన పరిశ్రమల వల్ల, తెల్లదోమ సోకడం కారణంగా కూడా ఆకులు తెల్లగా రంధ్రాలు ఏర్పడడం, తద్వారా నల్లగా అయిపోయాయి. దీంతో దిగుబడి తగ్గి నష్టాలు చవి చూస్తున్నాం.
– దేవవరపు రాజేష్ ఖన్నా, రైతు, మంగవరం

పుణ్యకోటి వాహనంపై తిరువీధి సేవలు



పుణ్యకోటి వాహనంపై స్వామివారి తిరువీధి సేవలు నిర్వహిస్తున్న అర్చకులు

నక్కపల్లి: వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉపమాక వేంకటేశ్వరస్వామిని పుణ్యకోటి వాహనంపై తిరువీధి సేవలు నిర్వహించారు. ఉదయం మూలవిరాట్‌కు విశేష పూజలు, నిత్య అర్చనలు జరిపారు. దిగువ ఉత్సవమూర్తులకు రోజువారి పూజలు నిర్వహించిన అనంతరం శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామివారిని పుణ్యకోటి వాహనంపై ఉంచి తిరువీధి నిర్వహించారు. అనంతర రాత్రి సేవల్లో భాగంగా విశేష పూజలు, తీర్థగోష్ఠి, ప్రసాద వినియోగం జరిగాయి. ఈ కార్యక్రమాల్లో అర్చక స్వాములు వరప్రసాదాచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, రాజగోపాలాచార్యులు పాల్గొన్నారు.

శాంతియుతంగా సమస్యలు పరిష్కరించుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

మునగపాక: గ్రామాల్లో సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని తహసీల్దార్ పి.సత్యనారాయణ కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన ఎంఎల్‌సీసీ కార్యక్రమంలో భాగంగా అర్జీదారులతో ఆయన మాట్లాడారు. వ్యక్తిగత ప్రతిష్ఠకు పోకుండా సాధ్యమైనంత వరకు పెద్దల సమక్షంలో సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు.

సత్తెమ్మతల్లి అమ్మవారి ఆలయ నిర్మాణానికి విరాళం



మునగపాకలోని సత్తెమ్మతల్లికి రూ.10,116 విరాళం అందజేస్తున్న భక్తుడు నాయుడు

మునగపాక: మునగపాక చెరువు కాలువ సంఘ పరిధిలో నిర్మిస్తున్న సత్తెమ్మతల్లి అమ్మవారి ఆలయ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పలువురు భక్తులు తమవంతు ఆలయ నిర్మాణానికి సాయం అందజేస్తున్నారు. రాజుపేటకు చెందిన వ్యాపారవేత్త దుబాసి నాయుడు తనవంతు సాయంగా శనివారం రూ.10,116 నగదును విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దాడి చంద్రరావు, వెలగా అప్పలనాయుడు, సంఘ సభ్యులు కర్రి రామజోగినాయుడు, బొడ్డేడ అప్పలనాయుడు, వెలగా వెంకటప్పారావు, వెలగా ధర్మసూరి, వెలగా శ్రీనివాసరావు, దాడి సూరప్పారావు, కొణతాల మాణిక్యం, వెలగా సురేష్, ఆడారి బాపునాయుడు, బొడ్డేడ రామునాయుడు పాల్గొన్నారు.

ముద్రగడను కలిసిన చిక్కాల



ముద్రగడతో మాట్లాడుతున్న చిక్కాల రామారావు, తదితరులు

పాయకరావుపేట: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంను కిర్లంపూడిలో ఆయన స్వగృహంలో శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, గోపాలపట్నం, మాసీహెబుపేట సర్పంచ్‌లు పన్నీరు బాబ్జి, గెడ్డమూరి నీలవేణి శ్రీనివాసరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు ధనిశెట్టి మహేష్, పంచాయతీ ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, ధనిశెట్టి తులసి పాల్గొన్నారు.

బొడ్డేడకు అభినందనల వెల్లువ



మాజీ ఎమ్మెల్యే రమణమూర్తిరాజు ఆశీస్సులు తీసుకుంటున్న ప్రసాద్



యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త ధర్మశ్రీ ఆశీస్సులు పొందుతున్న ప్రసాద్

మునగపాక: వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తగా ఇటీవల నియమితులైన బొడ్డేడ ప్రసాద్‌ను పలువురు పార్టీ నేతలు ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు, నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీలను శనివారం ప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిసి ఆశీస్సులు అందుకున్నారు. యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్ తన అనుచరులతో కలిసి ప్రసాద్‌కు పూలమాల వేసి, శాలువా కప్పి సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, పార్టీ నాయకులు కాండ్రేగుల నూకరాజు, దాసరి అప్పారావు, నరాలశెట్టి సూర్యనారాయణ, మద్దాల వీరునాయుడు, మొల్లేటి శంకర్, కోసువల్లి రామ్మోహనరావు, మొల్లేటి వినోద్, ఆడారి కాశీబాబు, పిన్నమరాజు రవీంద్రరాజు, కాండ్రేగుల జగన్, బొడ్డేడ బుజ్జి, మురళి, రామకృష్ణ, ఇందల నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

14వ రోజుకు మత్స్యకారుల దీక్ష



దీక్ష కొనసాగిస్తున్న మత్స్యకారులు

నక్కపల్లి: బల్క్ డ్రగ్ పార్క్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాజయ్యపేట మత్స్యకారులు చేస్తున్న నిరాహార దీక్ష 14వ రోజుకు చేరుకుంది. ఇతర ప్రాంతాల్లో వ్యతిరేకించిన ఈ పార్క్‌ను రాజయ్యపేటలో ఏర్పాటు చేయడం కుదరదని పలువురు మత్స్యకారులు స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోను తమ గ్రామాల పరిధిలో ఏర్పాటు చేసేందుకు ఒప్పుకునేది లేదన్నారు. హోంమంత్రి వచ్చి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రాణాలైనా ఇస్తాం..బల్క్ డ్రగ్ పార్క్‌ను అడ్డుకుంటామంటూ వారు హెచ్చరించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఎస్.రాయవరం: కొరుప్రోలు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. కొరుప్రోలు ఫీడర్ పరిధిలో కొరుప్రోలు, కోనవానిపాలెం, టీపీ రోడ్డు ఫీడర్‌లో టీపీ రోడ్డు, తిమ్మాపురం గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత అవసరం



ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో శుభ్రం చేస్తున్న అధికారులు

మునగపాక: మండల పరిషత్ సముదాయాల ఆవరణలో శనివారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి రహీమ్, తహసీల్దార్ పి.సత్యనారాయణ, ఎంపీడీవో ఎం.ఉషారాణి చీపుర్లు, కత్తులు తదితర పరికరాలతో తుప్పల తొలగించారు. చెత్త తొలగింపు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రహీమ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా గుర్తించి పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. వెలుగు ఏపీఎం బాలరాజు, మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ మురళీధర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మానస, ఆర్ఐ కృష్ణవేణి, ఏపీవో శివ, మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

శమీ శత్రువినాశిని నమోస్తుతే!




భగీరథమ్మ ఆలయంలో దీపాలంకరణ చేస్తున్న కరణం ధర్మశ్రీ, బొడ్డేడ ప్రసాద్



మునగపాకలో బాల త్రిపుర సుందరి అవతారంలో దుర్గమ్మ



రాజరాజేశ్వరి అలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరి



గాయత్రీ ఆధ్యాత్మిక జ్ఞానపీఠంలో లలితాదేవి అలంకరణ

యలమంచిలి రూరల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి నామస్మరణ అంతటా మార్మోగుతోంది. జగజ్జనని ఆలయాలు, చలువ పందిళ్లు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు అమ్మవారు వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో రాజరాజేశ్వరి అలంకరణలో భక్తులను కటాక్షించారు. ఆలయంలో మహిళలు వేంకటేశ్వర గానామృతం ఆలపించారు. బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సమితి ఆఫీసు వీధి గాయత్రీ ఆధ్యాత్మిక జ్ఞానపీఠంలో అమ్మవారిని లలితాదేవి రూపంలో అలంకరించారు. బాలార్చన, సామూహిక సుహాసినీ పూజ వైభవంగా నిర్వహించారు. పలుచోట్ల భవానీ భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అన్నప్రసాద వితరణ చేశారు.

అచ్యుతాపురం రూరల్ : హరిపాలెం హరిగిరి కొండపై వెలసిన విజయ కనకదుర్గమ్మను వైఎస్సార్‌సీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, పార్టీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం వారికి ఉత్సవ కమిటీ సభ్యులు అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. పార్టీ మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్రావు, జెడ్పీటీసీ లాలం రాము, ఎంపీపీ కోన సంధ్యబుజ్జి, మండల సీనియర్ నాయకులు మారిశెట్టి సూర్యనారాయణ, వైస్ ఎంపీపీ వాసుపల్లి పద్మశ్రీనివాస్, రవీంద్రరాజు, లాయర్ అప్పలనాయుడు, ఉత్సవ కమిటీ చైర్మన్ సూర్యచంద్ర, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అచ్యుతాపురం: దేవీ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అచ్యుతాపురం మండలంలోని అందలాపల్లి భగీరథమ్మ ఆలయంలో శనివారం రాత్రి దీపాలంకరణ కార్యక్రమం కనుల పండువగా జరిగింది. అమ్మవారిని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్, యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దీపాలంకరణ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు.



కోనవానిపాలెంలో దుర్గమ్మను దర్శించుకుంటున్న కంబాల జోగులు తదితరులు

ఎస్.రాయవరం: తిమ్మాపురం శివారు కోనవానిపాలెంలో ప్రతిష్ఠించిన దుర్గమ్మను మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, వైఎస్సార్‌సీపీ నాయకులు దర్శించుకున్నారు. అన్నసమారాధనలో పాల్గొని ప్రసాదం స్వీకరించారు. వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మధువర్మ, సింహాద్రి, సూరిబాబు, రమణ, రాజేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

బాల త్రిపుర సుందరిదేవీ అవతారంలో దుర్గమ్మ

మునగపాక: దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మండల వ్యాప్తంగా కనకదుర్గమ్మతల్లి శనివారం బాల త్రిపుర సుందరిదేవీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పలు గ్రామాల్లో అన్న సమారాధనలు, అంబలం పూజలతో పాటు కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. మునగపాక పల్లపు వీధిలో కుంకుమ పూజలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. మునగపాక పల్లపు వీధిలో శనివారం రాత్రి సారె ఊరేగింపు ఆకట్టుకుంది.



యలమంచిలి వాసవీ కన్యకాపరమేశ్వరి సన్నిధిలో వేంకటేశ్వర గానామృతం



మునగపాకలోని పల్లపు వీధిలో కుంకుమ పూజలో భక్తులు



మునగపాకలో సారె ఊరేగింపులో భక్తులు

ఆదర్శవంతంగా తోటాడ పంచాయతీ



శ్మశానవాటికలో చెత్త తొలగింపు పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ మంగవేణి కోటేశ్వరరావు

మునగపాక: తోటాడ పంచాయతీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామని సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు తెలిపారు. శనివారం తోటాడ శ్మశాన వాటికలో జేసీబీ సాయంతో జరుగుతున్న చెత్త తొలగింపు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలో సమస్యల పరిష్కారానికి పాలకవర్గం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బంది శ్రమదానం



పట్టణంలో సన్యాసమ్మ చెరువు వద్ద తుప్పలు తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది

యలమంచిలి రూరల్: పట్టణంలోని సన్యాసమ్మ చెరువు పరిసరాల్లో వ్యర్థాలు, తుప్పలను శనివారం మున్సిపల్ అధికారులు, సిబ్బంది తొలగించారు. స్వర్ణాంధ్ర..స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా చేపట్టిన శ్రమదాన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు, ప్రత్యేకాధికారి కె.శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు వ్యర్థాల తొలగింపులో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ స్వచ్ఛ యలమంచిలి పట్టణం సాకారం కావాలంటే ప్రజల తోడ్పాటు, సహాయ సహకారాలు ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

రజకులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?



బోదకుర్తి గణేష్, మునగపాక ఎంపీటీసీ

మునగపాక: ఎన్నికల ముందు రజకులకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తుంగలోకి తొక్కిందని మునగపాక ఎంపీటీసీ–3 బోదకుర్తి గణేష్ విమర్శించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రజకులను ఎస్సీ జాబితాలో చేరుస్తామంటూ ప్రతి ఎన్నికల ముందు చంద్రబాబు హామీలు గుప్పించడం తప్ప అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రజకులకు న్యాయం చేసిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రజకులను ఎస్సీ జాబితాలో చేర్చేలా చూడాలని గణేష్ కోరారు.

రక్తదానంతో ప్రాణదాతలు

యలమంచిలి రూరల్: రక్తదానం చేసి, ప్రాణదాతలు కావాలని యలమంచిలి ప్రభుత్వాస్పత్రి వైద్యులు పిలుపునిచ్చారు. శనివారం ఆస్పత్రిలో స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 12 యూనిట్ల రక్తం సేకరించినట్టు ఆస్పత్రి వైద్యాధికారిణి నిహారిక తెలిపారు. రక్తదానం చేయడం ద్వారా దాత ఆరోగ్యంగా ఉండడమే కాకుండా ముగ్గురికి ప్రాణదానం చేసిన వారవుతారని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి రక్తనిధి డాక్టర్ రమేష్, డాక్టర్ రవిచంద్ర, డాక్టర్ తబాస్సుమ్, డాక్టర్ శృతి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు గుర్రాల శేఖర్, పిట్టా దాసుబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.